# అతికి - అతకని హృదయాలు

శ్రీ బ్రహ్మం

నా నమ్మిన భాగ్యరాశి, నా జీవితరథ చోదనాసాధని-ప్రతిపురస్సరముగ నా కొనసగబడిన ఒకే ఒక బహుమానము. నా చేయి జారిపోయింది. అంత పిన్న వయస్సులోనే నను వీడిపోతుందని నే కలలో కూడ ఎన్నడూ తలంచినవాణ్ణి కాను. రెండు సంవత్సరాలు నాతో వుందో లేదో — అంతలోనే మటుమాయమైంది. ఇంతకూ కాలం కలిసి రాకపోతే, అన్నీ అనర్థాలే!

అతి నాజూగ్గా, నీలి మబ్బులాంటి రంగులో-అందంగా యవ్వనపు జిగితో కలకల లాడుతూ- తన్ను జూచిన కళ్ళను కాస్సేపు అలా నిలుపగలిగిన సమర్థురాలు. ఎన్ని భాషలు వచ్చు? మన దేశంలోని ఏ భాషలో పలుకరించినా కిలకిలా మంటూ జవాబిచ్చేది. ప్రపంచ దేశాల భాషలెన్నో తెలుసునని ప్రతీతి! నాతోమాత్రం, చిక్కటి తెనుగునా- నాకు తగిన ఇంగ్లీషు, హిందీలలో సంభాషణ సాగించేది. ఎంత చక్కటి వ్రాత- వంకరలుండేవా?

అందుకున్న ఆజ్ఞ ఎటువంటి కష్టతరమైనదైనప్పటికి-అప్పుడు— యిప్పుడూ అనకుండా అహర్నిశాలు నా సేవ జేసేది. నే ననుకున్నానా.... వెంటనే ఆ పని ముగించి మరింకేమైనా మిగిలిందా అన్నట్లు ముఖం పైకెత్తి-తనకై తానే ఆలోచిస్తూ నా ముఖంలోకి చూసేది. అంతే, అంటే చప్పున ఏమీ ఎరుగనట్టు ముడుచుకొని కూర్చుండేది. ఎంత అభ్యుదయవాది! కాస్త తీరిగ్గా కూచున్నా ఒకనాడు. ప్రక్కనే తన స్థానమాక్ర మించింది. చిరునవ్వుతో- ఒకమాట చెప్పనా అన్నట్లు నాలోకి చూసింది. పరాకుగా అఁ! అన్నా కన్నులతోనే మీరు ఏం చెప్పినా వ్రాస్తా. కాని ఒక్క షరతు. ఆ విషయం అటు సమాజానికైనా ప్రాతినిధ్యం వహించాలి: లేదా మీ వ్యక్తిగత భావమైనా కావాలి ... అంతేకాని అమ్మేడువ్రాతలు వ్రాయమంటే మాత్రం.........

వ్రాయనంటావు! అంతేనా? ఇందులో నీకు సంపూర్ణ స్వాతంత్ర్యమిస్తున్నా-తెలిసికొని మసలుకోవలసిన బాధ్యత నీదే అన్నా నవ్వుతూనే! తన వికసిత వదనం వెంటనే ముకుళించుకపోయింది. బహుశా తనే సంకుచిత ననే భావం స్ఫురించిందేమో!

తలుచుకుంటే హృదయం తరుక్కుపోతుంది. నాకు తెలియని విషయాలు ఎన్నో తనకు తెలుసు. తెలిసినా గర్వంతో ఏనాడూ— ఏమరిపాటున నైనా పొక్కేదిగాదు.

ఇక నా జీవితంలో సంపాదించుకోలేను. దురదృష్టమంటే ఎలాంటిదో అనుకునేవాణ్ణి. యిపుడిపుడే అర్ధమయింది.

అయినా చే జేతులారా చేసుకున్న పనికి, అంతా అయిన తర్వాత వగచిమాత్రం ప్రయోజనం? ఎదురు తిరగడమన్న మాట ఏనాడూ లేదే! తనకు ఒక్కొక్కప్పుడు కడుపులో దహించుకపోతూవుంటే, నాలుక తడియారి, దీనవదనయై ... అయ్యో ... ఏమనను? నాకు చేతులాడేవి కావు. మెదడు పనిమానివేసేది.

నిర్దయుణ్ణి ... ఈ పాపిష్టి చేతులే నా క్షణిక దౌర్బల్యానికిలోనై, ప్రాణప్రదమైన వస్తువులెన్నో పోయాయనే దుఃఖముతో తన్నుకూడ గంగపాలు గావించాయి. నా వికలమైన హృదయాన్నీ, నన్నూ మోసుకుంటూ బస్సు అతివేగంగా పోతూవుంది. ఇదే సమయమని మెదడు ద్విగుణీకృతశక్తితో పనిజేస్తూ తప్పటడుగులు వేసింది. స్మశాన వైరాగ్యం నాలో పుట్టుకొచ్చింది. ఉత్తరక్షణంలోనే తన్ను కూడ గంగపాలు గావించా క్షణికమైన తృప్తికొఱకు. కడసారి, తనివితీర . . ఆ సుందరవదనాన్ని తిలకించిన వాణ్ణి అయినా కాను దౌర్భాగ్యుణ్ణి!!

ఆక్షణం.... ఆక్షణంలో నాకు తన ఎడబాటువల్ల కలిగే బాధ అణువంతైనా తోచి ఉంటే-ఆ నీచకార్యానికి ఒడిగట్టేవాణ్ణికాను. ఇపు డంగలారుస్తే....! ఆజన్మాంతమూ యిలా బాధపడేకంటే.... నేనూ ...

వీడిపోయింది మళ్ళీ తనకు పునర్జన్మలేదు. ఎన్నో మార్లు చెప్పిం దావిషయం నాతో. పలుమారు కొద్దీ నిమిషాలో, గంటలో ఒకర్నొకరం విడిచి వుండడం తప్పని సరియయ్యేది. అప్పుడు ఎంతగా బాధపడేదో?

# అతికి - అతకని హృదయాలు

ఒక్కొక్కమారు అత్యధికమైన కోపంతో నురుగులు గ్రక్కేది. ఒక్కసారి చేయెత్తి దించానా.... ఒకేఒక సెకనులో చప్పున చల్లారి మందహాసా లొలికించేది. తనే నాకు అందమూ, ఆనందమూ ! ఇంతకూ నను వీడి పోయింది.

ఒక్కమాసం అష్టకష్టాలూపడ్డా హృదయంలో ఆరని చిచ్చు రగుల్కొలిపింది. ఏపని జేయాలన్నా చేతులు కట్టైపోయాయి. అధికార్లతో ఎన్నోమార్లు చీవాట్లు తిన్నా !

కడకు నిశ్చయించుకున్నా. గుండె దిటవు "కలవాడు" గా మెలగా లనుకున్నా. ఆశాజీవిగా జీవించాలనుకున్నా. తనలాగే నేనూ, నా తనువునూ బుద్ధినీ సర్వస్వం పరుల కొరకే, ఇతరుల సుఖం కొరకే అర్పించి ఏకాకిగా మనా లనుకున్నా. ఇంకా ఏమేమో అనుకున్నా....

అయినా, నాలో దౌర్బల్యం మూర్తీభవించింది. తన లాంటి వారే తన స్థానంలో కాకపోయినా మరొకరు కావలసి వచ్చింది. నా భావికార్యక్రమం నడపటానికి ఏదో పెద్దదిక్కుగానుంటే మంచిదని తోచింది. కాస్త రంగంలో అనుభవం కలవారేమే లనుకున్నా.

అలానే దొరికింది. ఎర్రగా పొట్టిగా (పుట్టెడుబుద్ధు లన్నట్టు) కాస్త నోరు పెద్దదే- కీచుగొంతు. నురుగులు గ్రక్కే గుణమూ— ఉత్తమ వంశ సంజాతననే మిక్కుటమైన పొగరూ వున్నాయని తర్వాత అనుభవమయింది. అనతి కాలంలోనే- నా పనంటేనే.... కడకు 'జీవిత మంటేనే రోతపుట్టింది. ఈ క్రొత్త సంపర్కంతో !

తనలాగే భాషలన్నీ వచ్చునంది. తన వినయవిధేయతలకూ తన పనికి- కావలసినన్ని సర్టిఫికేట్లగా కాగితాల కట్టలు చూపింది. నమ్మినా....నమ్మి మోసపోయినా జీవిత మంధకారమయమైంది. మరి వెలుగెక్కడిది ? హతోస్మి ! హతోస్మి ! !

తను "పైలెట్" జాతికి చెందినదానినంది. ఒక డాక్టరు దగ్గర పేరుప్రఖ్యాతులు గల ఒక ప్రజాసేవకునివద్ద తన పది సంవత్సరాల అనుభవమంతా- నా దగ్గర బూడిద పోసినపన్నీ రయింది. నే గంగపాలు జేసిన నా 'స్వాన్' లక్షరెట్లు మెరుగనిపించింది. చెడ్డ ప్రక్కన వుంటేనే మంచి ప్రకాశిస్తుంది. చీకటి వుంటేనే వెలుగు తెలుస్తుంది. తన పెద్దరికం నాదగ్గర సాగనప్పుడు, ఈసడింపులతో నాకే సుద్దులు జెప్పడం ఆరంభించింది.

నే ననుకున్నదంతా వ్రాసేది నా "స్వాన్." నేనోట చెప్పిందే వ్రాయక మొరాయిస్తుంది. ఈనాటి "పైలెట్" అదేమంటే నువ్వు అనుకున్నదంతా నాతో చెబుతున్నావా? నువ్వు చెప్పినదంతా నేవ్రాయడానికి?" ఎదురు ప్రశ్న. తల పొగరుగాక మరేమిటి! విజయావారి 'చంద్రహారం' చూచి లోపాలన్నీ ఏకరువు పెట్టాలనుకున్నాను నేను ! "ఉడుకుమోతుతనంలో త్వరపడి ఏదీ వ్రాయవద్దని, పాతికలక్షల రూపాయల, వందలాది పనివారి శక్తికి అది నిదర్శనమనీ, శక్తివుంటే అందులోని మంచిని కీర్తించి చెడును వదిలేయమని తనపదేండ్ల అనుభవం ఆలాపించింది. నీవెంత ? నీ అనుభవమెంత ? అంటూ - ఎంత ! అవమానం !

పోనీ అనుకొని ఎవరూ ఎన్నడూ కని విని ఎరుగని ప్రణయాన్ని గురించి ఆలోచించి మొదలు పెడితే .... అసభ్యం .... అసంగతం .... అంటూత్రోసివేసి మూతి ముడుచుకుంది. చల్లబడిన తనరక్తాని కేం తెలుస్తుంది యవ్వనో ద్వేగం ! ఏదో గేయాలైనా ప్రయత్నిస్తా మనుకుంటే .... చాల్లేవయ్యా నీ "కోయకవిత్వం" సమాధానం ! ఎంత లోకువయ్యాను! అంతా అయి వ్యాసాలేవైనా అని తయారైతే.... "మొదట కావలసిన స్టఫ్" సంపాదించుకో దిగ్గజాల్లాంటి వారున్నారు. వారిని వారి పరిశోధననూ, పరిశ్రమను చూడు ఒకసారి .... అంతూ పంతూ లేని నీతి బోధనలు ! అడ్డుపుల్లలు ! చచ్చానురా భగవంతుడా ! వేగలేక, వళ్ళుమండి పట్టరానికోపంతో "అయినా నీలాంటి సెకెండ్ హాండ్" బాపతును తెచ్చుకోవడమూ నాదేబుద్ధి పొరపా టన్నా దాంతో అగ్గయపోయి నీదే సెకెండ్ హాండ్ మొఖమే! నీ మొఖానికి పనికి రాక పోయానా? విసురుగా వచ్చింది జవాబు. ఛ ఛ పాడు నోరు.

గంగలో చేతులార జారవిడిచిన నా "స్వాన్" కలమే నా కుండి ఉంటే .... అయ్యోరాత .... చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటేఏంలాభం? ఇక ఈ "పైలెట్" కలానికి నాకూ పొత్తు కుదరదు. ఇదే విడాకుల పత్రం అందిస్తున్నా !

ఎవరైనా ఒక "స్వానో" మళ్ళీ ప్రెజెంటిస్తే !

గమనిక :— ఇది "పైలెట్" కడసారివ్రాత. దాని మనసులో ఏముందో ఏమో ! ! తప్పొప్పులకు బాధ్యత నాదికాదు.